నా త్యాగంతోనే రేవంత్‌కు సీఎం పదవి!

నాకే హెలికాప్టర్ లేదంటారా?

- నేను వెళ్లే పని అత్యవసరం కాదా ?
- ఉన్నతాధికారితో మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో సరికొత్త వివాదం రాజుకున్నది. హెలికాప్టర్ వినియోగంలో నేను సీఎంకన్నా తక్కువకాదు అనే రీతిలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వ్యవహరించడమే ఇందుకు కారణం. 'నేను త్యాగం చేస్తేనే ఆయనకు సీఎం పదవి వచ్చింది. నాకే హెలికాప్టర్ లేదంటారా? నేను ఎప్పుడు అవసరమైతే అప్పుడు హెలికాప్టర్‌ను వాడుకుంటాను' అని మంత్రి కోమటిరెడ్డి ఉన్నతాధికారితో వ్యాఖ్యానించడం ఇప్పుడు సచివాలయంలో చర్చనీయాంశంగా మారింది. అత్యవసర సమయాల్లో తప్ప మంత్రులు హెలికాప్టర్ వినియోగానికి నిబంధనలు వర్తించవని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే సీఎంకు.. కొందరు సీనియర్ మంత్రులకు మధ్య గ్యాప్ వచ్చిందనే వాదనలు వినిపిస్తున్న ప్రస్తుత సందర్భంలో హెలికాప్టర్ వ్యవహారం సరికొత్త తలనొప్పికి దారితీసిందనే వాదనలు వినిపిస్తున్నాయి.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం మంత్రి కోమటిరెడ్డి తరచూ నల్లగొండ పర్యటన కోసం హెలికాప్టర్ కావాలంటున్నారు. ఇప్పటికే పలుమార్లు హెలికాప్టర్‌ను వాడుకున్న మంత్రి కోమటి రెడ్డి .. ఇటీవల హెలికాప్టర్ కావాలని కోరడంతో ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు ఇందుకు నో చెప్పినట్టు సమాచారం. ముఖ్యమంత్రికి మాత్రమే హెలికాప్టర్ ఉపయోగించే వీలుంటుందని, మంత్రులు అత్యవసర సమయాల్లో మినహా ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపయోగించే వీలుండదని సదరు అధికారి తమ నిబంధనల గురించి మంత్రికి సున్నితంగా చెప్పారు. దీనిపై మంత్రి కోమటిరెడ్డి కొంత అసహనం వ్యక్తం చేస్తూ... 'నేను త్యాగం చేస్తేనే ఆయన సీఎం అయ్యారు. మీరు నాకే హెలికాప్టర్ లేదంటారా.. నేను ఎప్పుడు కావాలంటే అప్పుడు హెలికాప్టర్‌ను వాడుకుంటాను. నేను వెళ్లే పని అత్యవసరం కాదనా.. మీ ఉద్దేశం' అని పేర్కొన్నట్టు తెలిసింది. దీంతో ఏమి చేయాలో అర్థంకాక సదరు ఉన్నతాధికారి తలపట్టుకున్నట్టు సమాచారం.



ఢిల్లీకి సీఎం రేవంత్.. 25వ సారి

- రేపు సీడబ్ల్యూసీ సమావేశాలకు హాజరు
- పార్టీ పెద్దలతో మంత్రివర్గ విస్తరణపై చర్చ

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టారు. గురువారం జరుగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి ఆయన హాజరుకానున్నారు. అనంతరం పార్టీ పెద్దలు సమయం ఇస్తే వారిని కలిసి హైడ్రాతోపాటు మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం ఉంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఇది 25వ సారి. వారం క్రితమే ఢిల్లీ వెళ్లొచ్చిన సీఎం.. బుధవారం మళ్లీ విమానం ఎక్కనున్నారు. 10 నెలల్లోనే ఇన్నిసార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

10 నెలల్లో 50 రోజులు ఢిల్లీలోనే

గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంత తక్కువ సమయంలో ఇన్నిసార్లు ఢిల్లీ వెళ్లిన సందర్భాలు లేవు. ఆయన వెళ్లినప్పుడల్లా రెండు నుంచి ఐదు రోజులు అక్కడే ఉంటున్నారు. ఈ విధంగా దాదాపు 50 రోజులు అక్కడే మకాం వేశారు. జనవరిలో దావోస్ పర్యటన అని, ఆగస్టులో అమెరికా పర్యటన అని, ఇతర పర్యటనలతో సుమారు 20 రోజులపాటు విదేశీ పర్యటనల్లో గడిపారు.

పర్యటనలతో సాధించిందేమిటి?

సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ, విదేశీ పర్యటనలపై ఆది నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ పర్యటనలతో ఆయన సాధించిందేమిటి అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఢిల్లీకి 25 సార్లు వెళ్లిన సీఎం రాష్ట్రానికి ఏం సాధించారని పలువురు ప్రశ్నిస్తున్నారు. విదేశీ పర్యటనల విషయానికొస్తే.. దావోస్ పర్యటనలో 40 వేల కోట్ల పెట్టుబడులని, అమెరికా పర్యటనలో 30వేల కోట్ల పెట్టుబడులంటూ పేపర్లపై అంకెల గారడీ చూపించారే తప్ప.. క్షేత్రస్థాయిలో ఏదీ అమలు కాలేదనే పేర్కొంటున్నారు. విదేశాల్లో పర్యటన అనుభవాన్ని ఉపయోగించి ఇక్కడ పేదల ఇండ్లు కూల్చుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

దేశ భద్రతలో రాడార్ స్టేషన్ కీలకం

- దామగుండంలో శంకుస్థాపన చేసిన రక్షణమంత్రి
- పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదని హామీ
- వికారాబాద్ జిల్లాకు అన్యాయం జరుగదన్న సీఎం

వికారాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): దేశ భద్రతలో రాడార్ స్టేషన్ అత్యంత కీలకమని, దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రంతో పర్యావరణానికి హాని ఉండదని, అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. వికారాబాద్ జిల్లా దామగుండం వద్ద వీఎల్ఎఫ్ నేవీ రాడార్ కేంద్రానికి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గబోమని చెప్పారు. దామగుండం రాడార్ కేంద్రంతో స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడుతాయని తెలిపారు. తెలంగాణ ప్రజలు కష్టజీవులని, రక్షణ రంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుందని కొనియాడారు.

తెలంగాణ మరో ముందడుగు: సీఎం

దేశ రక్షణ విషయంలో తెలంగాణ మరో ముందడుగు వేసిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సముద్రంలో ప్రయాణించే నౌకలను మానిటరింగ్ చేయడానికి వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రాన్ని దామగుండంలో ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. రాడార్ కేంద్రం ఏర్పాటును కొందరు వివాదం చేస్తున్నారని, రాడార్ కేంద్రంతో తెలంగాణకు, వికారాబాద్ జిల్లాకు అన్యాయం జరుగుతుందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమిళనాడులో 35 ఏండ్ల క్రితం నేవీ రాడార్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని, అక్కడ ఎలాంటి హాని జరగలేదని చెప్పారు. దామగుండంలో అడవిలో రామలింగేశ్వర స్వామి ఆలయం ఉందని, అక్కడికి ప్రజలు వెళ్లేందుకు నిబంధనలు పెట్టొద్దని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి సురేఖ, చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, యాదయ్య, నావికాదళ ప్రధాన అధికారి దినేశ్ త్రిపాఠి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.

దామగుండం వైపు బారికేడ్లు పెట్టి స్థానికులను అడ్డుకుంటున్న పోలీసులు

మోమిన్‌పేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

వికారాబాద్ జిల్లా దామగుండం వద్ద నేవీ రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, చిత్రంలో సీఎం రేవంత్, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి సురేఖ

నిర్బంధాలు.. నిరసనలు

- ముందస్తు అరెస్టుల నడుమ రాడార్ కేంద్రంకు శంకుస్థాపన
- బీఆర్ఎస్, దామగుండం అటవీ పరిరక్షణ జేఏసీ నేతల అరెస్ట్
- దామగుండం చుట్టు పక్క గ్రామాల ప్రజల గృహ నిర్బంధం
- నల్ల బ్యాడ్జీలతో బీఆర్ఎస్ నేతల నిరసన

దామగుండంలో వద్దే వద్దు

జీవవైవిధ్యానికి మారు పేరుగా ఉన్న దామగుండంలో రాడార్ కేంద్రం వద్దే వద్దు. జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల నిర్బంధం, అరెస్టులు సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గుండారాజ్యాన్ని తలపించేలా పరిపాలన సాగుతుంది. ఇక్కడ రాడార్ కేంద్రం ఏర్పాటుకు ప్రకృతి కూడా సహకరించలేదు. భారీ వర్షంతో కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సీఎం రేవంత్ రోడ్డు మార్గాన రావడం ఇందుకు నిదర్శనం. **- శుభప్రద్‌పటేల్, జీసీ కమిషన్ మాజీ సభ్యుడు**

వికారాబాద్, అక్టోబర్ 15, (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా బీఆర్ఎస్ నేతలను, దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ సభ్యులను, ప్రకృతి ప్రేమికులను ఎక్కడిక్కడ నిర్బంధించారు. రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా నిరసనలు జరగకుండా సోమవారం రాత్రి నుంచే ముందస్తు అరెస్ట్‌లు చేశారు. అరెస్ట్ చేసిన దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ సభ్యులతోపాటు బీఆర్ఎస్, సీపీఎం నేతలను కుల్కచర్ల, పరిగి, వికారాబాద్, కోట్‌పల్లి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అక్రమ అరెస్ట్‌లతో పోరాటాన్ని ఆపలేరని, సేవ్ దామగుండం అంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ చైర్మెన్ దేవనోనిగూడెం వెంకటయ్య, జేఏసీ కో-ఆర్డినేటర్లు రామన్న మాదిగ, సునంద బుగ్గన్న యాదవ్, ఎరన్‌పల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నేతలు ప్రవీణ్‌రెడ్డి, మల్లేశం, శేరి రాంరెడ్డి, రాజు, రవికుమార్, టీజేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్, న్యూడెమోక్రసీ మల్లేశం, సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్, పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి గీత, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వై.మహేందర్ ప్రజాసంఘాల నాయకులు, తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అదేవిధంగా మోమిన్‌పేట్ మండలంలో అంత్యక్రియలకు వెళ్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను మోమిన్‌పేట్ మండలం చీమలదరిలో పోలీసులు అదుపులోకి తీసుకుని మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా దామగుండం పరిసర గ్రామాలు, తండాల ప్రజలను గృహ నిర్బంధం చేశారు. శంకుస్థాపన కార్యక్రమం ముగిసేవరకు కనీస అవసరాల కోసం కూడా బయటకు రానివ్వకుండా పోలీసులు భయభ్రాంతులకు గురిచేశారు.

మరోవైపు దామగుండం అడవిని నాశనం చేసి రాడార్ కేంద్రం ఏర్పాటును నిరసిస్తూ వికారాబాద్, తాండూర్‌లలో బీఆర్ఎస్ నేతలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్‌పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, కౌన్సిలర్ కిరణ్ పటేల్, బీఆర్ఎస్‌వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, నాయకులు సురేష్‌గౌడ్, కేదార్‌నాథ్, ప్రభాకర్‌రెడ్డి, రంజిత్, మణికంఠ తదితరులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ఇది నిర్బంధ పాలన : మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా బీఆర్ఎస్ నేతలను, దామగుండం అడవి పరిరక్షణ సమితి సభ్యులను, ప్రజలను అరెస్ట్, గృహనిర్బంధం చేయడంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది ప్రజాపాలన కాదని, నిర్బంధ పాలన అని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని, లేదంటే ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఆర్బీఐ నుంచి మరో వెయ్యి కోట్ల రుణం

రూ.73,495 కోట్లకు పెరిగిన రేవంత్ సర్కార్ అప్పులు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకున్నది. స్వయంగా ఆర్డీఐ మంగళవారం ఈ విషయాన్ని ప్రకటించింది. దీంతో నిరుడు డిసెంబర్ 7న అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 315 రోజుల్లో రేవంత్ రెడ్డి సర్కా రు తెచ్చిన అప్పులు రూ.74,495 కోట్లకు పెరిగాయి. గత నెలలో 3 దఫాలుగా రూ.4,500 కోట్ల రుణాలు పొందిన రేవంత్ ప్రభుత్వం.. ఈ నెల 1న రూ.2,000 కోట్ల అప్పు తీసుకున్నది. తాజాగా 21 ఏండ్ల కాలానికి బాండ్‌ను జారీచేసి మరో రూ.1,000 కోట్ల అప్పు తెచ్చింది. ఇలా ప్రతి నెలా రూ.5-6 వేల కోట్ల రుణాలు సమీకరిస్తున్న రేవంత్ సర్కారు ఇప్పటివరకు ఒక్క ఆర్బీఐ నుంచే 49,618 కోట్ల అప్పులు తెచ్చింది. ఇవి చాలక కార్పొరేషన్లు, స్వయం ప్రతిపత్తి సంస్థలకు గ్యారంటీలు ఇవ్వడంతో మరో రూ.25 వేల కోట్ల వరకు రుణాలను సేకరించింది.

గ్రూప్-1పై పిటిషన్ల కొట్టివేత

తీర్పు వెలువరించిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 నోటిఫికేషన్‌పై దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఆ పరీక్షకు సంబంధించిన ప్రశ్నలపై నిపుణుల కమిటీ తీసుకున్న నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 7 ప్రశ్నలపై పిటిషనర్లు లేవనెత్తిన సందేహాలకు కమిషన్ ఇచ్చిన సమాధానాలు ఆమోదయోగ్యంగానే ఉన్నాయని పేర్కొన్నది. ఈ మేరకు జస్టిస్ పుల్లా కార్తీక్ మంగళవారం తీర్పును వెలువరించారు. ఉన్నతాధికారుల పోస్టుల భర్తీ కోసం నిర్వహించే గ్రూప్-1 పరీక్షలో ప్రశ్నలు సూటిగా ఉండాలని అభ్యర్థులు కోరుకోవడం సరికాదని, అభ్యర్థుల సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు మెలికలతో కూడిన ప్రశ్నలు ఇవ్వడం పరిపాటేనని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఈ పరీక్షలపై 1,721 మంది అభ్యర్థులు వ్యక్తం చేసిన 6,417 అభ్యంతరాలను ఆయా సబ్జెక్టులకు చెందిన నిపుణుల కమిటీ పరిశీలించిందని, ఆ తర్వాతే కీని విడుదల చేసి, ఫలితాలను ప్రకటించారని తెలిపారు. ఈ వ్యవహారంలో నిపుణుల కమిటీ నిర్ణయమే అంతిమమని, అందులో జోక్యానికి ఆస్కారం లేదని పేర్కొన్నారు. 2022లో వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం పరీక్ష నిర్వహించాలన్న మరో పిటిషన్‌ను కూడా కొట్టివేస్తున్నట్టు జస్టిస్ కార్తీక్ ప్రకటించారు.

రేవంత్ కోర్టుకు రాకుంటే నిరాహారదీక్ష

- ఓటుకు నోటు కేసులో ఆయనే ఏ 1 ముద్దాయి
- ఆరేండ్లుగా కోర్టులచుట్టూ తిరగలేకపోతున్న
- లేదంటే అన్ని ప్రూఫ్‌లతో అందరికీ శిక్షపడేలా చేస్తా
- ఏ 4 ముద్దాయి జెరూసలేం మత్తయ్య హెచ్చరిక

ఓటుకు నోటు కేసులో ఏ 1 ముద్దాయి రేవంత్‌రెడ్డి కోర్టుకు హాజరు కావాలని గౌరవ ముఖ్యమంత్రిగా ప్రేమతో ఆహ్వానిస్తున్నా. తోటి ముద్దాయిగా పిలుపునిస్తున్నా. రేవంత్ కోర్టుకొచ్చి నిజాలు చెప్పి న్యాయస్థానాన్ని గౌరవించాలి. లేనిపక్షంలో ఇప్పటివరకు రేవంత్.. ఈ కేసులో ఆధారాలు ఎక్కడెక్కడ చెరిపివేశాడో.. తిరిగి నా దగ్గర ఉన్న నిజమైన అన్ని ప్రూఫ్‌లను కోర్టులకు, దర్యాప్తు సంస్థలకు ఇచ్చి తనతో సహా అందరికీ శిక్షపడేటట్టు చేస్తా. **- జెరూసలేం మత్తయ్య**

హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ఓటుకు నోటు కేసులో ఏ 1 ముద్దాయిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాంపల్లిలోని ఈడీ కోర్టులో బుధవారం జరిగే విచారణకు హాజరు కావాల్సిందేనని ఇదే కేసులో ఏ 4 ముద్దాయి జెరూసలేం మత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం నాటి ఈడీ వాయిదాకు రావాలని, లేనిపక్షంలో తాను అదే కోర్టులో దీక్ష చేస్తానని హెచ్చరించారు. ఆరేండ్లుగా ఓటుకు నోటు కేసులో కోర్టుల చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి హాజరైతే ట్రయల్ స్టార్ట్ చేస్తానని ఈడీ కోర్టు న్యాయమూర్తి చెప్తున్నారని, అందుకే ఒకసారి కోర్టు విచారణకు హాజరుకావాలని విజ్ఞప్తిచేశారు. కోర్టుల చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తనకు ఈ కేసు నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ట్రయల్ స్టార్ట్ అయితే కేసులో జరిగిన వాస్తవాలు న్యాయమూర్తికి పూర్తిగా చెప్పి, అన్ని ఆధారాలు ఈడీ కోర్టుకు సమర్పించి, తన బాధ్యతను నెరవేర్చుకుంటానని చెప్పారు. ఓటుకు నోటు కేసులో ఆయా దర్యాప్తు సంస్థల్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన అన్ని ఎవిడెన్స్‌ల కాపీలు, కొన్నింటిని అక్కడక్కడా మార్పులు చేసినా, వాటి అసలు కాపీల ఆధారాలు తన వద్ద భద్రంగా ఉన్నాయని చెప్పారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2015లో మొదలైన ఓటుకు నోటు కేసు అనేక మలుపులు తిరిగిందని, తన పేరు అన్ని కేసుల్లో కొట్టివేశారని, కేవలం నాంపల్లి ఈడీ కోర్టులో మాత్రమే పెండింగ్‌లో ఉన్నదని చెప్పారు.

ముఖ్యులందరికీ అధికారిక పదవులు

ఓటుకు నోటు కేసులోని ముఖ్యులైన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా, చంద్రబాబు ఏపీ సీఎంగా కొనసాగుతున్నారని జెరూసలేం మత్తయ్య పేర్కొన్నారు. మరొకరు వేం నరేందర్‌రెడ్డి ఏకంగా తెలంగాణ సీఎంవో ముఖ్య సలహాదారుగా ఉన్నారని, మరొకరు ఉదయ్ సింహ ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికారిక పదవిలో ఉన్నారని చెప్పారు. ప్రత్యక్ష సాక్షిని, పాత్రదారుడిగా ఏ-4గా ఉన్న తాను ఎటూకాకుండా పోయానని ఆవేదన వ్యక్తంచేశారు. ఒకసారి చేసిన తప్పుకు బలైన బాధితుడిని అని వాపోయారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. అలాంటిది ఆ ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నికైన రేవంత్‌రెడ్డి ఒక ప్రజాప్రతినిధిగా, బాధ్యతాయుత హోదాలో ఉండి, శాసనమండలిలో మరొక గౌరవ ఎమ్మెల్సీ సభ్యుడి ఎంపికలో రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సి ఉందని తెలిపారు. ఇతర పార్టీల సహకారం కోరడం అనైతికమని పేర్కొన్నారు. ఎవరైనా స్వార్థం కోసం పార్టీ మారి బహిరంగంగా ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఒక పార్టీ ఎమ్మెల్యేలను డబ్బు, పదవుల ఆశచూపి తమ పార్టీల్లో చేర్చుకోవడం నీచమని మండిపడ్డారు.

స్నేహితుడి కోసం రేవంత్ నన్ను బలిచేశారు!

రేవంత్‌రెడ్డి తన స్నేహితుడైన వేం నరేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పోస్టు ఇప్పించుకోవడానికి తనను బలి చేశారని జెరూసలేం మత్తయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ఏపీ సీఎం చంద్రబాబును బలవంతంగా ఒప్పించి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారిక ఎమ్మెల్యేల కొనుగోలును మొదలుపెట్టారని ఆరోపించారు. ఒక క్రిస్టియన్ నామినేటెడ్ ఆంగ్లో ఇండియన్ ఎమ్మెల్యేను ఒప్పించడానికి తనను క్రైస్తవ సంస్థ ప్రతినిధిగా వాడుకోవడం దారుణమని పేర్కొన్నారు. తనతో సంప్రదించడానికి వారి పార్టీలోని మరొక క్రిస్టియన్ లీడర్ జిమ్మిబాబును సంప్రదించారని గుర్తుచేశారు. ఇందులో మరొకరు అప్పటి రేవంత్ పార్టీ అనుకూల బిషప్ సెబాస్టియన్‌ను వాడారని తెలిపారు. ఆ తర్వాత ఇది రెండు రాజకీయ పార్టీల గొడవగా, మారి రెండు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య యుద్ధంగా మారిందని గుర్తుచేశారు. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టుల మధ్య, రాజీ ప్రయత్నాలు, ఆధారాల చెరిపివేత, సాక్షాల మార్చివేతలు జరిగి అన్ని కోర్టుల్లో అన్ని దర్యాప్తు సంస్థల్లో కేసు బలహీనమై దాదాపు దోషులందరికీ ప్రశాంతత దొరికిందని కేసు సాగిన క్రమాన్ని వివరించారు.

సజీవంగా ఉన్న ఏకైక ప్రత్యక్ష సాక్షిని నేనే..

తాజాగా సుప్రీంకోర్టులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ వేయడం, రీ ఓపెన్ చేయడానికి ఏపీ వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణ వేసిన పిటిషన్ కొట్టేయడం, కేసును వేరే రాష్ట్రానికి మార్చమని బీఆర్ఎస్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను కొట్టి వేయడంతో దాదాపుగా కేసు పూర్తిగా నీరుగారిపోయేలా మారిందని మత్తయ్య తెలిపారు. తాము ముద్దాయిగా అధికారికంగా ఉన్న నాంపల్లి ఈడీ కోర్టు మాత్రమే కొద్దిగా కేసును ప్రభావితం చేసి ఇప్పుడున్న ముఖ్యమంత్రులు, ఇతరులకు ఇబ్బందిగా ఉండబోతుందని చెప్పారు. అందుకు సజీవంగా ఉన్న ఏకైక ప్రత్యక్ష సాక్షిని తానేనని చెప్పారు. నాంపల్లి ఈడీ కోర్టులో బుధవారం ఏ 1 ముద్దాయి రేవంత్ హాజరై తన ఐడెంటిఫికేషన్ పూర్తి చేసుకుంటే కోర్టు వారు ట్రయల్ మొదలు పెట్టి ఓటుకు నోటు కేసు విచారణ మొదలు పెడతారని చెప్పారు. ఈడీ కోర్టు విచారణలో న్యాయసహాయం, న్యాయవాది ఖర్చుల కోసం ప్రస్తుత ఇంటెలిజెన్స్ డీజీ, అప్పటి ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శివధర్‌రెడ్డిని పలుమార్లు కలిసి ప్రభుత్వపరంగా సహకారం అందించాలని కోరగా నిరాకరించారని చెప్పారు. రేవంత్‌ను అడుక్కోపో.. అంటూ నిర్లక్ష్యంగా గెంటివేశారని ఆరోపించారు. సోమవారం ఇంటెలిజెన్స్ ఆఫీసులో కలవడానికి వెళ్తే కారెక్కి వెళ్లిపోయారని విమర్శించారు.

హైదరాబాద్‌కు మూడువైపులా సముద్రం ఉంది!

మొదటిపేజీ తరువాయి...



చుట్టూ మూడు సముద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో సీఎం వ్యాఖ్యలపై నెటిజన్లు జోకులు పేల్చుతున్నారు. నేను హైదరాబాద్‌లో సముద్రాన్ని చూడటానికి వెళ్తున్నాను. ఎవరైనా వస్తారా? అంటూ కొందరు కామెంట్లు చేస్తుండగా, మరికొందరు హుస్సేన్‌సాగర్ దగ్గర దిగిన ఫొటోలు పోస్ట్ చేస్తూ సముద్రాన్ని చూస్తున్నానంటూ జోకులు వేస్తున్నారు. గతంలో ఓ సందర్భంలో.. విమానం కావాలన్నా దిల్‌సుఖ్‌నగర్‌లో దొరుకుతుంది అంటూ సీఎం చేసిన కామెంట్లను, తాజా కామెంట్లను కలిపి వీడియోలు చేసి షేర్ చేస్తున్నారు. సీఎం ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని, అందుకే ఇలా తరుచూ తడబడుతున్నారని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. పాలనలో విఫలం అవుతుండటం, సహచర మంత్రుల నుంచి సహకారం లేకపోవడం, అధిష్ఠానం పెద్దగా పట్టించుకోకపోవడం, మంత్రులు తరుచూ వివాదాల్లో చిక్కుకుంటుండటం, కోర్టు సమస్యలు.. ఇలా సీఎం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్తున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఆగ్రహం పెరుగుతుండటంతో ఏం చేయాలో పాలుపోక ఇలా తడబడుతున్నారని విశ్లేషిస్తున్నారు.

కాంగ్రెస్‌లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు

- ఎంపీడీవో ఆఫీసు ఎదుట రామచంద్రాపురం నేతల గొడవ

బయ్యారం, అక్టోబర్ 15 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం రామచంద్రాపురం గ్రామ కాంగ్రెస్‌లో రెండు వర్గాల నాయకుల మధ్య ఇందిరమ్మ కమిటీల చిచ్చు రగిలింది. తాము సూచించిన వారినే కమిటీలో నియమించాలంటూ మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం బయట గొడవకు దిగారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం కమిటీలు ఏర్పాటు చేయాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన ముగ్గురి పేర్లు ఇవ్వాలని మాజీ ఎంపీటీసీ మంగీలాల్, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లును అధికారులు కోరారు. వారు తమ వర్గానికి చెందిన వేర్వేరు వ్యక్తుల పేర్లను సూచించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు తమపై పెత్తనం చేస్తున్నారని పాత కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తే.. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశామని, తమకు సముచిత స్థానం కల్పించాలని వాదించుకున్నారు. విషయం తేలకపోవడంతో కార్యదర్శి రామస్వామి ఇరువర్గాల పేర్లను ఉన్నతాధికారులకు అందించారు.

కొండా సురేఖ వర్సెస్ ఎమ్మెల్యేలు

ప్రతి నియోజకవర్గంలోనూ వర్గపోరు

సీతక్కతో మొదటి నుంచీ ఆధిపత్య పోరు

- సురేఖ పెత్తనంపై సర్వత్రా అసహనం
- గ్రూపు రాజకీయాలపై గుర్రుగా ఓరుగల్లు ఎమ్మెల్యేలు
- అధికారిక కార్యక్రమాలకూ పిలవని వైనం
- తాజా పరిణామాలపై హైకమాండ్ ఆరా